ఉత్తరం వచ్చింది

మల్లంగి గోపీకృష్ణ

"టంగు..టంగు' మంటూ పాతకాలంనాటి గడియారం పదకొండు గంటలు కొట్టింది

అన్నపూర్ణమ్మ మరోసారి బయటకువచ్చి వీధి చివరివరకూ ఆశగా చూసింది

"ఊహు .!" ఎక్కడా పోస్ట్‌మేన్ వస్తున్న జాడల్లేవు!

తనకు తెలియకుండానే ఆమె కళ్ళల్లో పలుచటి కన్నీటిపొర కదలాడింది చిన్నగా నిట్టూరుస్తూ లోనికెళ్ళిపోయింది

బయట వరండాలోని వాలుకుర్చీలో కూర్చొని పేపరు చూస్తున్న రంగనాథం మేష్టారు మనసులో ఆలోచనలు మేఘాలై ముసురుకొంటున్నాయి

అరగంట నుంచి చూస్తున్నా ఒక్క వార్తకూడా మనసు కెక్కడంలేదు విసుగ్గా పేపరును మడిచి ప్రక్కన పడేశాడు

అప్పుడే వీధి మలుపు తిరుగుతూ కనిపించాడు పోస్ట్‌మేన్!

రంగనాథంగారు నిర్నిమేషంగా అలాగే చూడసాగారు

అప్పుడే బయటకువచ్చిన అన్నపూర్ణమ్మ కళ్ళు దూరంగా వస్తున్న పోస్ట్‌మేన్‌ను చూడగానే వింతకాంతితో మెరిశాయి

అతను అక్కడక్కడా ఆగి ఉత్తరాలిస్తూ వస్తున్నాడు పోస్ట్‌మెన్ దగ్గర పడేకొద్దీ పరీక్షా పత్రాన్ని అందుకోబోయే విద్యార్థిలా అన్నపూర్ణమ్మ గుండె అదుర్దాగా కొట్టుకోసాగింది

రంగనాథంగారి ఇల్లు దగ్గరపడగానే 'సారీ మాష్టారూ ..ఈ రోజు కూడా ఉత్తర మేమీ రాలేదు" అంటూ జాలితో కూడిన చిరునవ్వును విసిరేసి సైకిలు త్రొక్కుకుంటూ వెళ్ళిపోయాడు ఒకప్పటి రంగనాథం శిష్యుడైన ఆ పోస్ట్‌మేన్

రోజూ వినే సమాధానమే అయినా హృదయాన్ని ఎవరో ముల్లుతో పొడిచినట్లయ్యింది అన్నపూర్ణమ్మకు

ఎందుకో ఆమెకు పోస్ట్‌మేన్ తమ ఇల్లు దాటకముందు ఆప్తబంధువులా, ఇల్లు దాటిన తరువాత ఆగర్భ శత్రువులా అనిపిస్తాడు.

నెమ్మదిగా తలతిప్పి రంగనాథంగారి కేసి చూసింది

పోస్ట్‌మేన్ రాకముందు తనెంతగా ఆతృతపడుతుందో, పోస్ట్‌మేన్ వచ్చిపోయాక ఆయనంత క్రుంగిపోతాడు ఆయన కళ్ళలో కదలాడే నిరాశా నీలిమేఘాలు ఆమె దృష్టి నెప్పుడూ దాటిపోలేదు

అరవై ఏళ్ళవయసు తెచ్చిన గాంభీర్యం ఆరు నెలల ఆవేదన మూలంగా కరిగిపోతోంది రోజు గడిచి రోజు వచ్చేసరికి వృద్ధాప్యం కన్నా వేదన ఆయనను మరింతగా లొంగదీసుకొంటోంది.

'నే నలా లైబ్రరీదాకా వెళ్ళొస్తాను తలుపులు కాస్త దగ్గరకేసుకో" అంటూ చెప్పులేసుకొని బయల్దేరారు రంగనాథంగారు. మండుటెండను సైతం లెక్కచేయక మనశ్శాంతి కోసం వెళుతున్న ఆయనను చూస్తుంటే అన్నపూర్ణమ్మ మనసు బాధగా నిట్టూర్చింది ఉస్సూరుమంటూ వంట చేయడానికి ఉపక్రమించింది

మార్పు అన్నది కాలానికున్న ముఖ్యలక్షణమైతే, ఆ కాలం వారిముందు ఓడిపోయింది యాంత్రికంగా కదిలిపోయేకాలం వేదనను ఎక్కువచేసేందుకు మాత్రమే ఉపయోగండింది

* * * * * *

వరండాలో కూర్చొని బియ్యం బాగు చేసుకొంటున్న అన్నపూర్ణమ్మ తల ఎత్తకుండానే కళ్ళ చివర నుంచి రంగనాథంగారికేసి చూసింది

వాలుకుర్చీలో కూర్చొని భగవద్గీతను గుండెల మీదుంచుకొని అందులో లీనమైపోయారాయన

పాతికేళ్ళు ఆయనతో కలిసి కాపురంచేసిన ఆమె ఆ గీతా పఠనం వెనుక దాగిన గుండెను అర్థం చేసుకోగలదు వేదన వెల్లువై మనశ్శాంతి కరువైనప్పుడు మాత్రమే ఆయన భగవద్గీత నాశ్రయిస్తారు

పోస్ట్‌మేన్ వెళ్ళిపోయి అప్పుడే అరగంట గడిచిపోయింది మామూలుగానే ఈ రోజు కూడా ఉత్తరమేమీ రాలేదు

చెలియలి కట్టను దాటబోతున్న దుఃఖాన్ని ఆపుకొనేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాన్ని చూడగానే ఆమె మనసు కరిగిపోసాగింది

భగవద్గీతను ముందర పెట్టుకొన్న రంగనాథం గారికి అక్షరాలు అస్పష్టమై.. పరిసరాలు అదృశ్యమై. ప్రతీ పేజీలోనూ తన ఒక్కగా నొక్క కొడుకు సుందరరామమూర్తి మొహమే కనిపించ సాగింది ఇంత వేదనను కలిగిస్తున్న ఉత్తరాన్ని తలుచుకోగానే ఆయన ఆలోచనలు గతంలోకి జారిపోయాయి

* * * * * * *

దాదాపు పాతిక సంవత్సరాల క్రితం

అటు పల్లెగా ఎదగలేక, ఇటు పట్నంగా ఎదగలేక మధ్యస్థంగా ఉండిపోయిందా వూరు

చేత్తో ట్రంకు పెట్టి పట్టుకుని, నెలలు నిండిన భార్యతో ఆ వూళ్ళోకి అడుగుపెట్టాడు రంగనాథం. ఆ వూళ్ళో కొత్తగా ప్రారంభించిన ఎలిమెంట్రీ స్కూల్లో ఆయనను టీచరుగా నియమించారు అక్కడకు వచ్చాక కానీ ఆయనకు అసలు పరిస్థితి అర్థంకాలేదు స్కూలు పెట్టడానికి ఓ పశువుల పాకైనా యిమ్మని ప్రాధేయపడాల్సి వచ్చింది

మొదట్లో స్కూలుకు అసలు ఎవరూ వచ్చేవారు కాదు.

'ఈ చదువులు చదివి వాడు ఎవర్ని ఉద్ధరించాలి మాస్టారూ? ఏదో ఇంట్లో అన్నా ఉంటే కాస్త చేతికంది సహాయంగా అన్నా ఉంటాడు' అంటూ పిల్లల్ని స్కూలుకు ఎవరూ పంపేవారు కాదు

కాని రంగనాథం పట్టు విడవకుండా ప్రతి యింటికీ వెళ్ళి స్కూలుకు పిల్లల్ని పంపమని నచ్చ చెప్పేవారు ఆయన కృషి ఫలితంగా ఓ నలుగురు విద్యార్థులతో ఆ స్కూలు ప్రారంభమైంది. మెల్లమెల్లగా ఆ స్కూలులో చేరేవారి సంఖ్య పెరగసాగింది

సెలయేరులా ప్రారంభమయిన ఆ స్కూలు నెమ్మదిగా నదిలా రూపొందింది. చెరగని చిరునవ్వుతో అందరిని ఆప్యాయంగా పలకరించే రంగనాథంగారంటే అందరిలో ఏదో తెలియని అభిమానం ఏర్పడిపోయింది.

"మా పిల్లవాడికి నాలుగు అక్షరం ముక్కలు నేర్పించారు. ఈ అరటిగెలుంచండి మాస్టారూ".

"మీ దయవల్ల మా వాడికి పట్నంలో పై చదువులకి అవకాశంవచ్చింది మీరు ఈ సంవత్సరం బియ్యం కొనకండి. మా పొలం నుంచి ఓ రెండు బస్తాలు తెచ్చి ఇంట్లో పడేస్తాను"

వాళ్ళ మాటలు వింటూంటే రంగనాథంగారి మనసు ఆనందంతో పొంగిపోయేది. అభిమానంతో నిండిపోయేది.

ఆ వూరికొచ్చిన కొద్ది రోజులకే అన్నపూర్ణమ్మకు ఓ కొడుకు పుట్టాడు. వాళ్ళ తాత పేరు కలిసొచ్చేలా వాడికి సుందరరామ్మూర్తి అని పేరు పెట్టుకొన్నారు రంగనాథం రామ్మూర్తి అంటే ఇద్దరికీ బహిఃప్రాణంలా వుండేది. వాడికి ఏ చిన్న దెబ్బ తగిలినా తమకే తగిలినంతగా బాధపడిపోయేవాళ్ళు

రామ్మూర్తిది చిన్నప్పటి నుంచీ అదో రకమైన మనస్తత్వం. తన యీడువాళ్ళతో ఎవరితోనూ కలిసేవాడు కాదు. స్నేహితులతో కన్నా

పుస్తకాలతో నే మంచి స్నేహం కుదిరిందతనికి

స్కూలులో ఎప్పుడు ఫస్టు వస్తుండే తన కొడుకును చూస్తుంటే రంగనాథంగారికి గర్వంగా ఉండేది

హైస్కూలులో చదువుకుగాను ప్రక్కనున్న పట్నానికి పంపించేందుకు నిశ్చయించుకున్నారు కానీ ఆ నిర్ణయం తీసుకొనేటప్పుడు ఆయన మనసు మూగగా ఏడ్చింది రెండు రోజులపాటు ఆ ఇంట్లో ఎవరూ సరిగ్గాభోంచేయలేదు

చివరకు గుండెను రాయిచేసుకొని అన్నిరకాల జాగ్రత్తలు చెప్పి తమ ఊరి పిల్లలతో కలిసివుండేలాగున ఏర్పాటు చేసివచ్చారు

మొదట్లో ఏదో కోల్పోయినట్లు ఇద్దరూ బాధపడేవారు కానీ క్రమంగా దానికి అలవాటుపడిపోయారు వారానికి రెండుసార్లు వచ్చే ఉత్తరాలే వారిని ఓదార్చేవి ఏ కారణంచేతనయినా ఉత్తరం రావడం ఆలస్యమయినా లేక రాకపోయినా వెంటనే రంగనాదంగారు పట్నానికి పయనమయ్యేవారు

శెలవులలో రామ్మూర్తి ఇంటికి వచ్చినప్పుడు పోయిన కళ అంతా తిరిగి వచ్చినట్లనిపించేది ఉన్నన్ని రోజులూ పండగలాగా గడిచిపోయేవి

రోజులు దొర్లిపోతున్నాయి పది కేలండర్లు తిరిగిపోయాయి

రామ్మూర్తి డిగ్రీ ఫస్టుక్లాసులో పాసయ్యాడు

ఉద్యోగాన్వేషణలో వున్న రామ్మూర్తి నుంచి ఒమారు హఠాత్తుగా ఉత్తరం ఒదులు టెలిగ్రామ్ వచ్చింది

నేను పెళ్ళి చేసుకుంటున్నాను. వచ్చి ఆశీర్వదించవలసింది' అని'

నాలుగయిదు సార్లు చదివాకగాని విషయం అర్థంగాలేదు అర్థమయ్యాక ఆయనకు కాళ్ళు చేతులు ఆడలేదు మరో నాలుగు గంటలలో భార్యతో కలిసి పట్నంలోని కళ్యాణమండపంలోకి అడుగుపెట్టిన ఆయనకు నూతన దంపతులు పెళ్ళి బట్టలతో ఎదురొచ్చి నమస్కరించారు

"కులం కాని అమ్మాయిని చేసుకొంటే కాదంటారని అలా చేశాను మీ మనసు బాధపెట్టుంటే నన్ను క్షమించి ఆశీర్వదించండి "

కొడుకు మాటలు విన్న రంగనాధానికి నిజంగానే బాధేసింది . వేరే కులమమ్మాయిని పెళ్ళి చేసుకొంటున్నాడనికాదు ' పాతికేళ్ళుగా ప్రేమతో పెంచిన తల్లి దండ్రుల్ని అర్థం చేసుకోలేనందుకు ప్రేమించి చేసుకొనే పెళ్ళని అంగీకరించి ఆశీర్వదించగల హృదయం తమకుందని గుర్తించనందుకు'

ఆర్తితో దొర్లిన కన్నీటిబొట్లే అక్షింతలై ఆ జంటను ఆశీర్వదించాయి

కొడుకు-కోడలు కళ్ళముందుంటే చాలు అన్న వాళ్ళ ఒక్క ఆశకూడా త్వరలోనే ఆవిరైపోయింది

రామ్మూర్తికి రూర్కేలాలోని ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో ఉద్యోగం వచ్చింది మంచి ఉద్యోగం. వదులుకొంటే మళ్ళీరాదు అంటూ జాయినైపోయాడు

కాస్త ఆలస్యమైనా పర్లేదు-కాస్త దగ్గర్లో ఉద్యోగం చూసుకోరాదూ" అభ్యర్థన లాంటి రంగనాథంగారి కోరికను పాతకాలం బుద్ధులంటూ కోడలు కొట్టిపడేసింది

రైల్లో ప్రయాణమైపోతున్న వారికి వీడ్కోలు నిచ్చేందుకు వెళ్ళిన అన్నపూర్ణమ్మ కంట నీరు నిలువలేదు రంగనాథంగారికి పెద్దరికం అడ్డుపడటంతో అశ్రువులన్నీ కనుకొలకులలోనే ఇంకిపోయాయి తన హృదయాన్ని ఎవరో తననుంచి దూరంచేసి తీసుకెళ్ళినట్లయ్యిందాయనకు

ఒరేయ్' నిన్ను కని పెంచి ప్రేమతో పెద్దచేసిన రెండు ముసలి ప్రాణాల మూగబాధ నువ్వెందుకు అర్థంచేసుకోలేవురా మేం బ్రతికుండేదాకా నయినా మా ఎదురుగా వుంటే మాకు కాస్త మనశ్శాంతిగా నయినా వుంటుంది మా మాట వినరా" అని కొడుకుకు గట్టిగా అరిచి

చెప్పాలనుకున్నాడు . కానీ కొడుకు ప్రయోజకుడైతే చాలన్న తండ్రి మనస్సు ఆయనలోని భావసంచలనాన్ని అణిచివేసింది.

తరువాత వాళ్ళు ఒకటి రెండుసార్లు కొడుకు దగ్గరికెళ్ళివచ్చారు కోడలి సూటిపోటి మాటలు అక్కడ వారిని ఎక్కువరోజులు నిలువనిచ్చేవికావు

రామ్మూర్తి భార్యతో కలిసి సొంతవూరికి వచ్చినా నాలుగయిదురోజులకన్నా ఎక్కువ వుండేవాడుకాదు తనకు సెలవు లేదనో, కోడలికి ఈ వాతావరణం సరిపోవడంలేదనో వెంటనే వెళ్ళిపోయ్యేవాడు

రానురానూ ఆ రాకపోకలు కూడా కరువయ్యాయి రామ్మూర్తి ఏవి మరిచిపోయినా తన చిన్ననాటి అలవాటును మాత్రం మరిచిపోలేదు. ఎన్ని పనులున్నా ప్రతీవారం తప్పకుండా ఒక్క ఉత్తరమన్నా వ్రాసేవాడు.

ఆ ఉత్తరం నలిగిపోయేదాకా చదువుకోవడంలోనూ . తర్వాత మళ్ళీ రాబోయే ఉత్తరం కోసం ఎదురుచూడడంలోనూ వారికి సంతృప్తి, స్వాంతన లభించేవి ఏ వారమైనా ఉత్తరం రాకపోతే వాళ్ళ మనస్సు విలవిలలాడిపోయేది రామ్మూర్తికి ఏ మయిందోనన్న ఆవేదన వారిని నిద్రాహారాలకు దూరంచేసేది

అలాంటిది ఈమధ్య ఉత్తరాలు రావడం బాగా తగ్గిపోయింది నెలకొక ఉత్తరం రావడమే కష్టమైపోతోంది

మొదట్లో వాళ్ళకు అర్థమయ్యేదికాదు కానీ ఈమధ్యనే మెల్లమెల్లగా అర్థం కాసాగింది.. .ఉత్తరాలు వ్రాయకపోడానికి కారణం వాడికి తీరిక లేకపోవడం కాదని . దానికి అసలు కారణం నిర్లక్ష్యమేనని ..!

ఆ నిర్లక్ష్యమే యిప్పుడు వాళ్ళ మనసుల్ని నిప్పై కాలుస్తోంది

ఒక చిన్న ఉత్తరం కోసం.. ఆ ఉత్తరం మోసుకొచ్చే) అక్షరాలలోని కాసింత ఆప్యాయతకోసం

ఉత్తరం వచ్చింది

ఆ ముసలి హృదయాలు రెండూ తపించి పోతున్నాయి

* * * * * * *

ఆలోచనా ప్రపంచంలోంచి బయటపడి భారమైన హృదయంతో భార్యవైపు చూశాడు

అందాకా చేస్తున్న పనిని మరిచిపోయి వరండాలో గోడకు తగిలించిఉన్న ఫోటో వైపే చూస్తూ ఆలోచిస్తూందామె

ఆ ఫోటోలో రామ్మూర్తి తమిద్దరి మధ్యనా నిలబడి ఉన్నాడు. అది రామ్మూర్తిని హైస్కూలులో చేర్చేందుకు పట్నానికి తీసుకెళ్ళినప్పుడు తీసుకొన్నది ఫోటోగ్రాఫరు ఎంత నవ్వమని చెప్పినా

తమిద్దరి మొహంలోనూ బాధ కనిపిస్తూనే ఉంది రామ్మూర్తిని అక్కడ వదిలి వచ్చేటప్పుడు అన్నపూర్ణ ఎంతగా ఏడ్చిందో ఆయనకింకా బాగా గుర్తుంది. కానీ తనే మనసును గట్టి పరుచుకొని అన్నపూర్ణకు నచ్చచెప్పి ఎలాగో తీసుకొచ్చాడు

వాడి దగ్గరి నుంచి ఉత్తరం వచ్చేంత వరకూ ఆమె మామూలు మనిషి కాలేకపోయింది.

అంత పిచ్చిగా వాడిని ప్రేమించినందుకు వాడు తమకిచ్చిన ప్రతిఫల మేమిటి? ప్రతిఫలాన్నాశించే వాడిని తాము ప్రేమించారా.. .??

కానీ ప్రేమకు ప్రతిఫలంగా ప్రేమను కోరడంలో తప్పులేదుగా ... !!

ఆయన ఆలోచనలు ఆయన అదుపు తప్పిపోతున్నాయి

తను గమనిస్తూనే ఉన్నాడు అన్నపూర్ణ ఈ ఆరునెలల్లో బాగాచిక్కిపోయింది. వార్ధక్యం అంతా ఒక్కసారిగా మీదపడ్డట్లు క్రుంగిపోతోంది. లోపలికి పోయిన కళ్ళచుట్టూ నల్లటి వలయాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఈ మధ్య భోజనం కూడా సరిగ్గా చెయ్యడం లేదు ఆకలిలేదంటూ మంచినీళ్ళు త్రాగి పడుకొంటోంది తన జీవితంలో ఒక ముఖ్యభాగమైన . కాదు.. జీవితమే ఐన ఆమె వేదనను చూస్తుంటే ఆయన మనసు బాధతో విలవిలలాడిపోతోంది

"ఇంతటి దుఃఖాన్ని ఆమె చిన్న గుండె ఎన్నాళ్ళనిమోయగలదు ...? ఆ ఆలోచన రాగానే అతని శరీరం భయంతో ఒక్కసారిగా వణికింది.

'ఊహు.. అలా జరగడానికి వీల్లేదు. అలా జరగడానికి వీల్లేదు" తనలో తానే గొణుక్కొన్నాడు.

మరి ఆమె దుఃఖాన్ని తనెలా దూరం చేయగలడు . ??

ఆ ప్రశ్నకు సమాధానం రెండు రోజులుపాటు ఎడతెగకుండా ఆలోచించిన తరువాత దొరికింది

* * * *

నాలుగు రోజులు ఏ విశేషము లేకుండానే గడిచి పోయాయి.

ఆ రోజుకూడా మామూలుగానే తెల్లవారింది

రంగనాథం వరండాలో న్యూస్ పేపర్‌ను కళ్ళముందుంచుకుని కూర్చున్నాడు అతని కళ్ళు మాత్రం రాబోయే పోస్ట్‌మాన్ కోసమే ఎదురు చూస్తున్నాయి

ఎందుకో ఆ రోజు అన్నపూర్ణమ్మ కూడా హడావిడిగానే కనిపిస్తోంది

ఎన్నడూలేనిది "ఏవండీ ఉత్తరమేమైనా వచ్చిందా?" అంటూ ఇప్పటికే నాలుగుసార్లడిగింది మామూలుగా అయితే మనసులో ఉత్తరం కోసం ఎంత ఎదురు చూస్తున్నా పైకి మాత్రం ఏమీ పట్టించుకోని దానిలా కనబడేందుకు ప్రయత్నిస్తుండేది.

ఆమె ఆతృతను చూసి రంగనాథం తనలో తానే చిన్నగా నవ్వుకొన్నాడు. కానీ ఆ నవ్వు వెనక అతని హృదయం తీసుకొన్న ఒక నిర్ణయం కదలాడుతోంది.

"ఎందుకో ఈ రోజు ఉత్తరం తప్పకుండా వస్తుందని నాకు నమ్మకంగా ఉంది పూర్ణా" అన్నాడు వీధివైపు చూస్తూ.

అన్నపూర్ణమ్మ మొహంలో ఆశ్చర్యం ఓ క్షణంపాటు కదిలి మాయమైంది

"నాకూ అలాగే అనిపిస్తుంది" అంటూ లోనికి వంట పనిమీద వెళ్ళింది. రంగనాథం మళ్ళీ పేపర్ వైపు దృష్టి మరల్చాడు

"సార్.. ! పోస్ట్"

" . . .. "

ఉత్తరం కోసం ఎప్పుడూ ఎదురు చూస్తుండే వాళ్ళు ఈరోజు ఉత్తరం వచ్చిందన్నా తీసుకోడానికి రాకపోయేసరికి పోస్ట్‌మేన్‌కు ఎక్కడలేని ఆశ్చర్యంవేసింది.

"సార్, మీకు మీ అబ్బాయిదగ్గరనుంచి ఉత్తర మొచ్చిందిసార్!" అన్నాడు మరింత గట్టిగా.

రంగనాథం కదల్లేదు.

"పూర్ణా ....! నీకు మీ అబ్బాయిదగ్గరనుంచి ఉత్తరం వచ్చినట్లుంది కాస్త చూడూ......"



గడుసులోకం -బాబు



అన్నాడు పేపర్‌లోంచి తల బయిటకు పెట్టకుండానే

'నాకా ? అదేదో మీకే వ్రాసివుంటాడు ఎంతయినా మీ ముద్దులకొడుకుకదా అంటూ తడిచేతులు చీరకొంగుకి తుడుచుకొంటూ వచ్చి నిలబడింది

లేదమ్మా, ఈరోజు మీ యిద్దరికీ అబ్బాయిదగ్గిరనుంచి రెండు ఉత్తరాలు వచ్చాయి అంటూ ఉత్తరాల నందించాడు

"ఇద్దరికీనా ? వాళ్ళిద్దరి గొంతులూ ఒకేసారి ఆశ్చర్యంతో ప్రశ్నించాయి

ఉత్తరాల్ని అందుకొని చించి చదవబోతున్న వాళ్ళ కళ్ళల్లో ఆనందాశ్రువులు మెరుస్తున్నాయి. వణుకుతున్న చేతులతో ఉత్తరం మడతలు విప్పుతూన్న రంగనాదాన్ని ఆనందంతో పాటూ అయోమయం కూడా చుట్టుముట్టింది

తను ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమించే అన్నపూర్ణ ఆవేదనను తాత్కాలికంగా నయినా దూరం చేయాలని తను ఆత్మవంచన చేసుకొనైనా ఆమె కన్నీటిని కాస్తయినా తుడవాలని రామ్మూర్తి ఆమెకు ఉత్తరం వ్రాసనట్లు తనే వ్రాసి ప్రక్కవూరినుంచి పోస్ట్‌చేయించాడు ఆమెను మభ్యపెట్టి మోసం చేస్తున్నానేమో అన్న ఆలోచన కలిగినా, అన్నపూర్ణ మీద ప్రేమ ఆ ఆలోచనను తుడిచివేసింది మరి ఇప్పుడు

తనకూ ఉత్తరం వచ్చిందంటే రామ్మూర్తి నిజంగానే ఉత్తరం వ్రాశాడన్నమాట ఇన్నాళ్ళకయినా వాడికి తాము గుర్తుకు వచ్చి నందుకు ఆయనకు చెప్పలేని సంతోషమేసింది

పూజ్యాలైన నాన్నగారికి,

క్షేమం ఇంత ఆలస్యంగా ఉత్తరం వ్రాస్తున్నందుకు నన్ను మన్నించండి అత్యవసరమైన ఆఫీసు పనులవలన

రంగనాధంగారి కళ్ళు ఉత్తరం వెంబడి పరిగెడుతూన్నా, ఆయన మనసు సంబోదన దగ్గిరే నిలిచిపోయింది

"పూజ్యాలైన నాన్నగారికి '

"పూజ్యాలైన నా "ఉత్తరాన్ని మరోమారు చూశాడు

సందేహంలేదు

అతని హృదయాకాశంలోని మబ్బులన్ని మెల్లగా చెదిరిపోతున్నాయి అన్నాళ్ళూ తెలియని నిజం కోటిసూర్యుళ్ళ కాంతితో ప్రకాశిస్తూ కనిపిస్తోంది

'పూజ్యాలైన" అన్న సంబోధన రామ్మూర్తి ఎన్నడూ వాడేవాడుకాదు అసలు వాడి కెపుడూ అలా వ్రాసే అలవాటేలేదు ఇక ఆ ఉత్తరంలోని అక్షరాలు ఆయనకు పాతికేళ్ళుగా చిరపరిచితాలు

నిద్రలోంచి లేపి అడిగినా ఆయన వాటిని సులభంగా గుర్తుపట్టగలడు

ఆ సంభోధన అన్నపూర్ణది ఆ అక్షరాలు అన్నపూర్ణవి వాటివెనుక దాగిన ఆర్ద్రహృదయం అన్నపూర్ణది!

ఆయనకు నవ్వాలనిపించింది

పిచ్చిగా పగలబడి నవ్వాలనిపించింది ఇంత సంతోషాన్ని మోస్తున్న గుండె పగిలిపోయేదాకా నవ్వాలనిపించింది ఎదుటనే ఒయాసిస్సునుంచుకొని, ఎండమావుల వెంబడి పరిగెత్తిన తన పిచ్చితనానికి నవ్వాలనిపించింది కాంతి ప్రవాహమై పొంగే ప్రేమను గుర్తించకుండా, గుడ్డివాడిలా మిణుగురు పురుగులకోసం వెతికిన తన అమాయకత్వానికి, అజ్ఞానానికి తనే జాలిపడి నవ్వాలనిపించింది అలా నవ్వుతూనే నీళ్ళు నిండిన కళ్ళతో ఎదురుగావున్న అన్నపూర్ణమ్మ వైపు చూశాడు

ఆమె మొహంలో కనబడుతూన్న జావాల్ని చూడగానే అనిపించింది తనే ఆమెకు ఉత్తరం వ్రాసినట్లు తెలిసిపోయిందని!

ఇద్దరికీ నోట నుండి మాట రావటంలేదు

ఒకరికళ్ళలోకి ఒకరు అలాగే చూస్తుండిపోయారు

పాతికేళ్ళుగా కలిసి కాపురం చేస్తున్నా ఒకరి నొకరు ఎందుకు సరిగ్గా అర్ధంచేసుకోలేకపోయారో వారికే తెలియడంలేదు

కలిసిన ఆ కళ్ళనుంచి ప్రేమ గంగాతరంగాల్లా ప్రవహిస్తోంది ఆ చూపుల్లో ఆప్యాయతవుంది అక్షరాల కందని ఆత్మీయతవుంది మాటల్లో చెప్పలేని మమకారం వుంది

అన్నిటినీ మించిన ఓదార్పు దాగుంది

తనకోసం ఇంతగా తపించిపోయే వ్యక్తి తన ఎదురుగానే వున్నారన్న నిజం వాళ్ళిద్దరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది అందని ప్రేమకోసం అర్రులుచాచి తమ మధ్యన పెరుగుతున్న ప్రేమలతను నిర్లక్ష్యం చేసిన తమ అవివేకానికి ఆశ్చర్యమేస్తోంది ఈ వయసులో తమకు కావలిసింది కాసింత ఆప్యాయత మరి కాస్త ఆత్మీయత!

ఇక ప్రేమంటే

ఒంటరి మనసును ఓదార్చి సేదతీర్చేది '

కష్టసుఖాలను కలిసి పంచుకొనేది "

ఆ ఆత్మీయతను, ప్రేమను, ఆప్యాయతను అందించేందుకు కన్నకొడుకయినా కట్టుకున్న వాళ్ళయినా వేరెవ్వరయినాఒక్కటే

"మనిషెవ్వరయినా కావలిసింది వారి మనసు అందించే ప్రేమ మాత్రమే!"

ఆ భావన వాళ్ళలో కలగగానే పాతికేళ్ళ తమ వైవాహికజీవితాన్ని, అందించిన సుఖదుఃఖాల్ని అన్నిటినీ మరిచిపోయి,అప్పుడే పెళ్ళయిన కొత్తదంపతుల్లా మనసువిప్ప మాటల్లో మునిగిపోయారు

* * * * * *

ప్రతీరోజూ ఉత్తరం కోసం పడిగాపులు కాచేవాళ్ళు, ఇప్పుడు తను వాళ్ళ ఇల్లు దాటిపోతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదో పోస్ట్‌మేన్‌కు కొంచెం కూడా అర్ధంకాలేదు

బహుశా ఎప్పటికీ అర్ధంకాదేమోకూడా "□